# దారి మళ్లింపు



**చౌటుప్పల్ నవభూమి:** చౌటుప్పల్ పట్టణంలోని ఆర్టీసీ బస్ స్టేషనకు రూ.కోట్లలో విలువ చేసే స్థలం ఉంది. ఈ స్థలం నుంచి దారికోసం బస్ స్టేషనకు పడమర దిశలో ఆర్టీసీకి చెందిన భూమిని దారి పేరుతో ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఉత్తర, దక్షిణ దిశలలో పూర్తిగా ప్రహరీ గోడను నిర్మించిన ఆర్టీసీ అధికారులు పడమర దిశ లో కొద్ది దూరం వరకే ప్రహరీగోడ ను నిర్మించి వదిలి వేశారు. దీంతో ఈ స్థలంపై కొంత మంది వ్యక్తుల కన్ను పడింది. వెనక వైపున ఉన్న రెండు ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు తెరవెనుక ఉండి దారి పేరుతో ఆర్టీసీ స్థలాన్ని ఆక్రమించే కుట్రకు తెర లేపినట్టు ప్రచారం జరుగుతోంది. వెనక వైపునకు వెళ్లేందుకు రెండు చోట్ల నుంచి దారులు ఉన్నాయి. అయినా ప్రైవేట్ వ్యక్తుల స్థలాలు, ఇళ్లతో బస్ స్టేషన భూమికి ఎలాంటి సంబంధం లేదు. బస్ స్టేషన స్థలం నుంచి పడమర దిశలో దక్షిణంలోని హైవే సర్వీసురోడ్డు నుంచి ఉత్తర భాగంలోని ప్రహరీగోడ వరకు 40 అడుగుల వెడల్పుతో సుమారు 200 గజాల పొడవున దారి ఏర్పాటు పేరుతో విలువైన స్థలాన్ని ఆక్రమించేందుకు కొంత మంది వ్యక్తులు పెద్ద స్కెచనే వేశారు. ఈ మేరకు మునిసిపాలిటీలోని ఒక అధికార పార్టీ నాయకుడి ఆధ్వర్యంలో కొంతమంది వ్యక్తులు ఇటీవల మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. దీంతో పట్టణ వాసుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. బస్ స్టేషనను ఏర్పాటు చేసిన తరువాత ఇళ్లు కట్టుకున్న వ్యక్తులు బస్ స్టేషన స్థలం నుంచి 40 అడుగుల దారిని కోరడం విచిత్రంగా ఉందని, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి తొందరపడి ఆర్టీసీ స్థలం అన్యాక్రాంతానికి సహకరించవద్దని పట్టణ వాసులు కోరుతున్నారు. ఒక వేళ బస్ స్టేషన భూమి నుంచి దారి కోసం స్థలాన్ని కేటాయించేందుకు ప్రయత్నించిన పక్షంలో అఖిల పక్షం ధ్వర్యంలో ఉద్యమాలు తప్పవని పలువురు హెచ్చరిస్తున్నారు. ఎలిమినేటి మాధవరెడ్డి హయాంలో..దివంగత పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎలిమినేటి మాధవరెడ్డి జాతీయ రహదారి పక్కన ఐదు ఎకరాల భూమిని ఆర్టీసీ బస్ స్టేషన ఏర్పాటు కోసం కేటాయించారు. 1985 అక్టోబరు 6వ తేదీన బస్ స్టేషన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సంవత్సరంలోపుగా బస్ స్టేషన ను నిర్మాణం చేయించి ప్రయాణికులకు అందుబాటులోకి తెచ్చారు. ఈ స్థలంలో బస్ డిపోను ఏర్పాటు చేసేందుకు మాధవరెడ్డి ప్రయత్నాలు చేశారు. అప్పటి రాష్ట్ర రవాణా శాఖమంత్రి నందమూరి హరికృష్ణ, హోంమంత్రి ఎలిమినేటి మాధవరెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు 1995 అక్టోబరు 14వ తేదీన ఖమ్మం జిల్లా పర్యటనకు వెళుతూ బస్‌స్టేషన ను అకస్మికంగా పరిశీలించారు. ప్రయాణికుల సౌకర్యార్థం బస్ డిపో ఏర్పాటుకు మంత్రి హరికృష్ణ గ్రీన సిగ్నల్ ఇచ్చారు. కానీ హరికృష్ణ ఇచ్చిన హామీ అమలు కాలేదు. మాధవరెడ్డి అర్ధాంతరంగా మృతిచెందడంతో బస్ డిపో ప్రతిపాదన తెరమరుగైంది. నాటి నుంచి నేటి వరకు బస్ డిపో ఏర్పాటు గురించి పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. ఆర్టీసీ దిమ్మెల వరకు ప్రహరీని నిర్మించాలి ఆర్టీసీ అధికారులు ఏర్పాటు చేసిన హద్దుల నిర్ధారణ దిమ్మెల వరకు ప్రహరీ గోడ ను నిర్మించాలి. డిపోను ఏర్పాటు చేయించాలన్న ఉద్దేశంతోనే దివంగత పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎలిమినేటి మాధవరెడ్డి 1985లోనే 5-00 ఎకరాల భూమిని కేటాయించారు. కోట్లాది రూపాయల విలువైన బస్ స్టేషనకు చెందిన భూమిని అన్యాక్రాంతం జరగకుండ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి. దారి పేరుతో ఆర్టీసీ స్థలం అన్యాక్రాంతం జరిగితే ఊరుకునేది లేదు. అఖిల పక్షం ఆధ్వర్యంలో ఉద్యమాలను సాగిస్తాం.







నవభూమి
నల్లగొండ
అనుబంధం
12 సెప్టెంబర్,2024 గురువారం పేజీలు:5
www.epaper.navabhoomi.in


### కమ్యునిష్టుల సాయుధ పోరాటం ద్వారానే

# తెలంగాణ ప్రజలకు విముక్తి

- సిపిఐ కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు
- వుస్తెల సృజన మహిళా సమాఖ్య రాష్ట్ర అద్యక్షురాలు




**గరిడేపల్లి నవభూమి** భూమి కోసం ,భుక్తి కోసం,వెట్టిచాకిరీ నుండి విముక్తి కోసం,నైజాం ఆటవిక రాజరిక పాలనకు వ్యతిరేకం గా,నిజాం రజాకర్ సైన్యంతో పోరాడి,దొరల,భూస్వాముల,దేశముఖ్ ల గుండాలకు వ్యతిరేకం గా కమ్యునిష్టులు వీరోచిత పోరాటం ద్వారానే తెలంగాణ కు విముక్తి లభించిందని సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు,మహిళా సమాఖ్య రాష్ట్ర అద్యక్షురాలు వుస్తెల సృజన లు అన్నారు.తెలంగాణ సాయుధ పోరాట 76 వ వార్షికోత్సవాలను గరిడేపల్లి మండలం లోని పొనుగొడు గ్రామంలో మాజీ సర్పంచి తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ హనుమాల లింగయ్య గారి స్తూపమ్ వద్ద,గానుగబండ,రంగాపురం గ్రామాల అమరవీరుల స్తూపాల వద్ద అరుణ పతాకాలను ఎగుర వేసి నాడు వారు ప్రజల కొరకు పోరాడిన పోరాటాలను స్మరించుకొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాయుధ పోరాటం తో ఏ సంబంధం లేని,ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో వున్న బిజెపి పార్టీ చరిత్రను వక్రీకరించి మత ఘర్షణలుగా చుపించటానికి ప్రయత్నిస్థున్నారని అన్నారు.ఈ కార్యక్రమానికి సిపిఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు అద్యక్షత వహించగా,కార్యక్రమం లో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్,బద్దం క్రిష్ణరెడ్డి,దేవరం మలీస్వరి,కొటమ్మ,సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు కడియాల అప్పయ్య,యడ్ల అంజిరెడ్డి,బిల్ల కనకయ్య,ప్రజానాట్యమండలి కళాకారులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొనారు.



## వైటీపీఎస్‌లో లక్షలాది రూపాయల విలువైన కాపర్ సామాగ్రి చోరీ

## గరిడేపల్లి మండల పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీ ఎన్నిక



**గరిడేపల్లి నవభూమి:** మండల కేంద్రము జీవము గల దేవుని సంఘం నందు గరిడేపల్లి మండల పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక జరిగినది. ఈ సమావేశం మాజీ అధ్యక్షులు పాస్టర్.దేవదానం అధ్యక్షతన జరిగినది. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పాస్టర్ జి డేవిడ్ రాజు గౌరవ సలహాదారులు పాస్టర్ సామ్యూల్ గుండు జిల్లా సభల కన్వీనర్ పాస్టర్ పాల్రాజు హుజూర్నగర్ నియోజకవర్గ ప్రెసిడెంట్ పాస్టర్ టీ సుధాకర్ సమక్షంలో కమిటీ ఎన్నిక చేయడం జరిగింది.గౌరవ అధ్యక్షులుగా పాస్టర్ జాకబ్ రాజు,ప్రెసిడెంట్ గా పాస్టర్ .పౌలు ,వర్కింగ్ ప్రెసిడెంట్ పాస్టర్ కరుణాకర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ పాస్టర్ కోటేశ్వరరావు సెక్రటరీ పాస్టర్ ప్రభు కిరణ్, జాయింట్ సెక్రెటరీ పాస్టర్ చిట్టిబాబు ట్రెజరర్ పాస్టర్ లక్ష్మణ్ నాయక్,గౌరవ సలహాదారులు పాస్టర్ ఇమ్మానుయేలు పాస్టర్ జకర్య ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ పాస్టర్ ఎం జేమ్స్ జేమ్స్ ఆనంద్ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది ఇట్టి సమావేశమునకు గరిడేపల్లి మండల పాస్టర్స్ 30 మంది పాస్టర్స్ హాజరు అయినారు

## పోషణ మాస ఉత్సవ కార్యక్రమం



**గరిడేపల్లి నవభూమి** ఈ నెల 1 వ తేది నుండి 30 వ తేది వరకు పోషణ మాస ఉత్సవం లో భాగంగా ఈ రోజు గరిడేపల్లి మండలము లో కీతవారిగూడెం సెక్టార్ లో సర్వారం-2 అంగన్వాడి కేంద్రంలో న్యూట్రిషన్ డే నిర్వహించడం జరిగినది.... ఇందులో భాగంగా సూపర్వైజర్ %ూ. =వఋఫ్ప్రఱ%... గర్భిణీలకు, బాలింతలకు, పిల్లల యొక్క తల్లులకు అంగన్వాడి సెంటర్లో ఇస్తున్న ఫుడ్ యొక్క ఉపయోగాలను తెలియజేశారు, అదేవిధంగా అంగన్వాడి సెంటర్లో పూర్వ ప్రాథమిక విద్య గురించి తల్లులకు అవగాహన కల్పించారు .... ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ రేవతి అంగన్వాడి టీచర్స్ వంశీ ప్రియ ఉషా ఆశా ఆయమ్మ పాల్గొన్నారు

## సాగులో.. కొత్తదారిలో..!

**మేళ్లచెరువు, నవభూమి** వరి, పత్తితో పాటు మిరప తోటలే కన్పించే క్రిష్ణపట్టె ప్రాంతంలో కొత్తగా కరివేపాకు తోట సాగునకూ శ్రీకారం చుట్టారొక రైతు.కరివేపాకు వ్యాపారంలో తనకున్న అనుభవంతో ప్రయోగాత్మకంగా ఈ తోట సాగు చేపట్టానని ఆయన చెబుతున్నారు.

సాగులో మెలకువలు పాటిస్తూ, ఆశించిన రీతిలో ఆకు దిగుబడినీ సాధిస్తున్నట్టు పేర్కొంటున్నారు. తనకున్న అనుభవంతో మార్కెట్లో విక్రయించగలుగుతున్నానని చెబుతున్న ఈ రైతు పేరు గడిపూడి సైదులు. గత జనవరిలో ఈ తోట వేశారు. రెండు కోతలొచ్చాయని చెబుతున్న సైదులు.. సైదులు మార్కెట్ చేయగలిగితేనే..మాది సాధారణ వ్యవసాయ కుటుంబమే. మా స్వగ్రామం ఆంధ్రాలోని మోర్జంపాడు. ప్రస్తుతం మేళ్లచెరువు మండలం రేవూరులో ఉంటున్నాం. నేను మొదట్నుంచీ వ్యవసాయం చేస్తూనే.. కరివేపాకును సేకరించి మార్కెట్లకు ఎగుమతి చేస్తుంటా. పల్నాడు, ఎన్టీఆర్, ఇతర జిల్లాల తోటల వద్ద కరివేపాకు కొని వరంగల్, నిజామాబాద్ మార్కెట్లకు పంపిస్తుంటా. ఈ వ్యాపారంలో ఇరవై ఏళ్ల అనుభవంతో చింతలపాలెం మండలం వజినేపల్లిలో ఆరెకరాలు కౌలుకు తీసుకుని కరివేపాకు తోట వేశా. సంవత్సరానికి మూడు, నాలుగు కోతలొస్తుంది.

### వైటీపీఎస్‌లో లక్షలాది రూపాయల

# కాపర్ సామాగ్రి చోరీ

- 26 లక్షల నగదు, 2 మహేంద్ర క్యాంపరీ వాహనాలు స్వాధీనం
- కాపర్ దొంగల ముఠా అరెస్టు ఎస్పీ శరత్ చంద్ర పవార్



**మిర్యాలగూడ సెప్టెంబర్ 11:-** లక్షల రూపాయల విలువైన కాపర్ సామాగ్రి దొంగలిస్తున్న ముఠాను పోలీసులు ఛేదించారు. నల్లగొండ జిల్లా దామచర్ల మండలం వీర్లపాలెం గ్రామంలో నిర్మాణంలో ఉన్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ (వైటీపిఎస్) లో బీహెచ్ఈఎల్ కంపెనీకి చెందిన కాపర్ సామగ్రిని దొంగలించిన ఎనిమిది మంది ముఠాను బుధవారం అరెస్టు చేసినట్లు వారి వద్ద 20 లక్షలు నగదు రికవరీ, రెండు మహేంద్ర క్యాంపరి వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు నల్గొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు బుధవారం స్థానిక టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మిర్యాలగూడ పట్టణానికి చెందిన పాత ఇనుము వ్యాపారి మేకల శ్రీనివాస్, దామరచర్ల మండలం తాళ్ల వీరప్పగూడెం గ్రామానికి చెందిన బెల్ట్ షాపు నిర్వాహకుడు పెండెం భాస్కర్ సాత్ తండకు చెందిన గుగులోతు రఘు వీర్లపాలెం కు చెందిన కొర్ర శివ, తాళ్ల వీరప్పగూడెంకు చెందిన చేన్నబోయిన నాగయ్య, సాత్ తండా కు చెందిన గూగులోతు రాముడు, మిర్యాలగూడ పట్టణానికి చెందిన పాత ఇనుము వ్యాపారులు బత్తుల జానకిరాములు, పగడాల బాలరాజులను బుధవారం నమ్మదగిన సమాచారం మేరకు మిర్యాలగూడ పట్టణం.ఈదులగూడెంలోని పగడాల బాలరాజు పాత ఇనుము షాపు వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. నిందితులు గత కొంతకాలంగా వైటిపిఎస్ పక్కన గల వాగు నుండి రాత్రి సమయంలో ప్లాంట్ లోకి ప్రవేశించి బిహెచ్ఇఎల్ కంపెనీకి చెందిన స్టోర్ యార్డ్ వద్ద సెక్యూరిటీ సిబ్బంది లేని సమయం చూసి స్టోర్ యార్డులో ఉన్న కాపర్ సామాగ్రి, తదితర వస్తువులను దొంగలించి వాటిని నిర్మానుష్య ప్రాంతాల్లో పోగుచేసిన అనంతరం క్యాంపర్ వాహనాలలో లోడ్ చేసుకుని వాటిని పరిచయం ఉన్న మిర్యాలగూడకు చెందిన పాత ఇనుము వ్యాపారులకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. గత రెండు సంవత్సరాలుగా దొంగతనాలకు పాల్పడుతున్నట్లు గుర్తించామని తెలిపారు. ఇందులో ప్రధాన నిందితుడు మేకల శ్రీనివాస్ అనే అతనిపై ఇప్పటికే మూడు కేసులు నమోదు అయ్యి ఉన్నాయని అతనిపై రౌడీ షీటర్ నమోదు చేస్తున్నట్లు తెలిపారు. డీఎస్పీ కె.రాజశేఖర్ రాజు ఆధ్వర్యంలో సిఐలు నాగార్జున కె.వీరబాబు సిసిఎస్ సిఐ జితేందర్ రెడ్డి సిబ్బంది విష్ణువర్ధన్ గిరి, పుష్పా గిరి, వాహిద్ పాషా లను కేసును ఛేదించారని వారిని అభినందించారు. సమావేశంలో డిఎస్పి రాజశేఖర్రాజు, టూ టౌన్ సిఐ పి.నాగార్జున పాల్గొన్నారు.



## అంగన్వాడి పిల్లలకు కథల పుస్తకం ఆధారంగా చదువు

**మిర్యాలగూడ సెప్టెంబర్ 11:-**మిర్యాలగూడ అర్బన్ ఐసీడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో పోషణమాసంలో భాగంగా సీడీపీఓ ఆర్.మమత ఆధ్వర్యంలో ఇస్లాంపురం సెక్టార్ పరిధిలోని ఈదులగూడెం అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా బుధవారం షెడ్యూల్ ప్రకారం పిల్లలకు కథల పుస్తకాలను ఇచ్చి, కథల పుస్తకాలలోని చిత్రాల సహాయంతో కథ చదవడం, అక్షరాలను గుర్తించడం, శబ్దాలను అనుసరణ, పునరావృతం అయ్యే పదాల గుర్తింపు, కథల ఆధారంగా పిల్లలతో కథ చర్చించడం, వాటిపై సంబాషించారు. కథల పుస్తకం పట్టుకునే విధానం చూపించారు. అదేవిదంగా గర్భిణీ బాలింతలకు అవగాహన కలిగించి, పౌష్టికాహార ప్రాముఖ్యతను వివరిస్తూ, వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలు, అంగన్వాడీ కేంద్రాలలో లభించే పౌష్టికాహార పదార్ధాలను గురించి వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ముదిరెడ్డి నర్సిరెడ్డి, చల్లా వెంకన్న లయన్స్ క్లబ్ సభ్యులు బిఎమ్.నాయుడు,సూపర్వైజర్ నజీమా బేగం అంగన్వాడీ టీచర్ బొందు పార్వతి , కె.రామానుజమ్మ, ఎం.లలితమ్మ,జి.రజిత, హెల్పర్లు జి.లక్ష్మి, వి.లక్ష్మీ,క్, వి.పార్వతమ్మ లబ్ధిదారులు పాల్గొన్నారు.



# దొంగలుగా భావించి చితకబాదిన గ్రామస్తులు



**భూదాన్‌పోచంపల్లి-నవభూమి:** దొంగలనుకొని యువకులను గ్రామస్తులు చితకబాదిన ఘటన మంగళవారం పోచంపల్లి మండలం దోతిగూడెం గ్రామంలో జరిగింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..బీబీనగర్‌కు చెందిన సత్తిరెడ్డి తన కారులో చౌటుప్పల్ మండలం చిన్నకొండూర్ గ్రామానికి చెందిన గరిగె లక్ష్మీనారాయణ, పగడాల ప్రకాశ్, పాపగల్ల లింగస్వామితో కలిసి బీబీనగర్‌కు బయల్దేరారు. మార్గమధ్యలో పోచంపల్లి మండలం దోతిగూడెం మీదుగా వెళ్తూ అదే గ్రామంలో సత్తిరెడ్డికి తెలిసిన యాట లింగస్వామిని పరామర్శించేందుకు మంగళవారం తెల్లవారుజామున అతడి ఇంటికి వెళ్లారు. లింగస్వామి ఇంటి పక్కనే ఉంటున్న దాయాది యాట నరేశ్ చీకట్లో యువకులను గమనించి దొంగలుగా భావించి కేకలు వేశాడు. దీంతో సమీపంలోని గణేశ్ మండపాల వద్ద నిద్రిస్తున్న కొందరు యువకులు పరుగెత్తుకొని వచ్చి ముగ్గురు యువకులను చితకబాదారు. 100 నంబర్‌కు డయల్ చేశారు. పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని యువకులను అదుపులోకి తీసుకున్నారు. గాయపడిన గరిగె లింగస్వామిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోలీసుల విచారణలో వచ్చిన యువకులు దొంగలు కాదని తేలింది.

# వివిధ వాడల్లో వినాయకుని వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బిఎల్ఆర్

**మిర్యాలగూడ నవభూమి, సెప్టెంబర్ 11:-**శ్రీ సిద్దివినాయక చతుర్థి ఉత్సవాల్లో భాగంగా మిర్యాలగూడ నియోజకవర్గ వ్యాప్తంగా పలుచోట్ల 5వ రోజు బుధవారం వేడుకల్లో పాల్గొన్న మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో 39వ వార్డు సంతోష్ నగర్లో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ. సలీం, గార్లపాటి వెంకట్ రెడ్డి, మోహన్ రెడ్డి, సామాజిక కార్యకర్త యుగెందర్ యాదవ్ నాయకులు, బిఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు. రూ. 20,516లకు లడ్డును దక్కించుకున్న మద్దినేని వెంకటేశ్వర్లు రాధా. మిర్యాలగూడ పట్టణంలోని 24 వార్డ్ రాఘవేంద్ర కాలనీలో గణనాథుని నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బుధవారం మద్దినేని వెంకటేశ్వర్లు రాధా, ఆర్టివి ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్ హరీష్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జరిగిన లడ్డు వేలం పాటలో 20 వేల 516 రూపాయలకు మద్దినేని వెంకటేశ్వర్లు రాధాలు లడ్డును వేలం పాటలో దక్కించుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు కాలనీవాసులు, యువకులు పాల్గొన్నారు.







# ఘనంగా వినోబా బావే 129వ జయంతి

- భూదాన్ భూములను కాపాడుకునే బాధ్యత ప్రజలదే
- గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర అధ్యక్షుడు గున్న రాజేందర్ రెడ్డి



**భూదాన్ పోచంపల్లి నవభూమి ప్రతినిధి. సెప్టెంబర్ 10** భూములేని ప్రతి పేదవారికి భూమిని అందించాలని తాను దేశవ్యాప్తంగా భూధాన్ ఉద్యమాన్ని చేపట్టి 44 లక్షల ఎకరాల భూమిని సేకరించిన ఆచార్య వినోబాభావే ఆశయాలను తాను సాధించిన భూమిని కాపాడుకునే బాధ్యత ప్రజలదేనని గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర అధ్యక్షుడు గున్న రాజేందర్ రెడ్డి అన్నారు. బుధవారం ఆచార్య వినోబాభావే 129వ జయంతిని పురస్కరించుకుని వినోబా సేవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన వినోబా భావే, వెదిరి రామచంద్రారెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వినోబా మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ. దేశ ప్రజల సమగ్ర అభివృద్ధి తన ఆశయంగా స్వతంత్ర సమరయోధుడు భూదానోద్యమ పితామహుడుగా నిలిచిన గొప్ప వ్యక్తి ఆచార్య వినోబా భావే అని ఆయన తెలిపారు. దేశవ్యాప్తంగా చేపట్టిన బుదానోద్యమం లో పఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో లక్ష ఎకరాలను భూమిని సేకరించిన వ్యక్తి ఆయన అని తెలిపారు. ఈ భూమి ద్వారా తెలంగాణ రాష్ట్రంలో 60 వేల మందికి భూమిని పంచిన ఘనత వినోబాభావకి దక్కుతుందని ఆయన తెలిపారు. ఈ భూదాన్ భూమి ద్వారా ఇప్పటికే ప్రభుత్వ రంగ సంస్థలకు తోపాటు విద్యా సంస్థలు, గోశాలల నిర్మాణాల కోసం భూమిని అందించామని ఆయన తెలిపారు. భూదాన్ భూమికి ప్రతి ఒక్క రికార్డును ఉంచి ఇప్పటికీ భద్రపరిచామని ఆయన తెలిపారు కానీ నేడు సమాజంలో భూమి అక్రమ దారుల విపరీతంగా పెరిగిపోయారని 25 లక్షల ఎకరాలు ఉన్న వక్త బోర్డు భూమి ఏమైందని ఆయన ప్రశ్నించారు. భూధాన్ భూమి కబ్జాదారుల కోరల్లో చిక్కుకోకుండా తల్లి కన్నా పవిత్రంగా కాపాడుకునే బాధ్యత ప్రజలదేనని ఆయన మరోసారి గుర్తు చేశారు. ఆయన అందించిన స్ఫూర్తి ప్రపంచానికి మార్గదర్శకం అయ్యిందని ఆయన బాటల్లో మనమంతా పయనించి ఆయన నమ్మిన ఆశయ సిద్ధాంతాలను సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి మహాజన సంఘం అధ్యక్షుడు సీతా శ్రీరాములు, వినోబా సేవా సంఘం అధ్యక్షుడు ఏల బిక్షపతి, ఉపాధ్యక్షులు కొయ్యడ నరసింహ, సేవా సంఘం సభ్యులు వేషాల మురళి, గునిగంటి మల్లేష్ గౌడ్, కర్నాటి అంజమ్మ, తదితరులు ఉన్నారు.



# విద్యార్థులు నవ సమాజ నిర్మాతలుగా ఎదగాలి

- వ్యాసరచన విజేతలైన విద్యార్థులకు బహుమతులు
- డాక్టర్ మునీర్

**మిర్యాలగూడ నవభూమి, సెప్టెంబర్ 11:-**తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్తుకు ఉపాధ్యాయులు బాటలు వేస్తారని జనయేత్రి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ మునీర్ అహ్మద్ షరీఫ్ అన్నారు. టీచర్స్ మార్గదర్శనం మేరకు విద్యార్థులు నవ సమాజ నిర్మాతలుగా ఎదగాలని అభిలషించించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నల్లగొండ జిల్లా ప్రఖ్యాత స్పోకెన్ ఇంగ్లీష్ ట్రైనర్, సోషల్ సర్వీస్ ఆర్గనైజర్ హమీద్ షేక్ వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన చిన్నారులను ఘనంగా సత్కరించి బహుమతులు ప్రదానం చేసిన డాక్టర్ మునీర్ మాట్లాడుతూ చిన్నారుల్లో ప్రతిభను వెలికితీసేందుకు గత 20 ఏండ్లకు పైగా పోటీ పరీక్షలను నిర్వహిస్తున్న హమీద్ షేక్ సేవలు నిరూపమానమైనవన్నరు. నేటి పోటీ ప్రపంచంలో నిలదొక్కుకొని నిల్చోవాలంటే విద్యార్థుల్లో ప్రేరణ అత్యవసరమని అన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. వ్యాసరచన పోటీల్లో పాల్గొనడం ద్వారా లేఖనా సామర్థ్యాలు వృద్ధి చెందుతాయని సూచించారు. గత 20 ఏండ్ల నుంచి 20 వేలకు పైగా సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించిన హమీద్ షేక్ ను అభినందించారు. విద్యార్థులను బాధ్యతయుత భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే గురుతర బాధ్యత ఉపాధ్యాయులదేనని డాక్టర్ మునీర్ తెలిపారు. విద్యార్థులు తమ అమూల్య సమయాన్ని సామాజిక మాధ్యమాల వైపునకు మళ్లించకుండా పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని కోరారు. వ్యాసరచన పోటీల్లో లిటిల్ ఫ్లవర్ హై స్కూల్ కు చెందిన 8వ తరగతి విద్యార్థిని అబీన ముస్కాన్ ప్రథమ స్థానంలో, ఆదిత్య హై స్కూల్ కు చెందిన 7వ తరగతి విద్యార్థిని జె.భవ్య, ద్వితీయ స్థానంలో, అభ్యాస్ టెక్నో స్కూల్ కు చెందిన 10వ తరగతి విద్యార్థిని విద్యార్థులు ఎల్.అక్షత తృతీయ స్థానంలో నిలిచారు. కైరలి స్కూల్ కు చెందిన ఏడో తరగతి విద్యార్థి ఎ.అలెక్ తేజ్ కన్సోలెషన్ బహుమతికి ఎంపికయ్యారు. వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన చిన్నారులను జనయేత్రి ఫౌండేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. అనంతరం డాక్టర్ మునీర్ జ్ఞాపికలు, పతకాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ పోగుల సందీప్, నాగరాజు, సైదులు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.





## వచ్చే మార్చి నాటికి వైటీపీఎస్‌లో నిర్ణీత లక్ష్యం 4,000 మెగావాట్ల

# విద్యుత్ ఉత్పత్తి సాధించాలి

- ◆ భూనిర్వాసితులకు పరిహారం, ఉద్యోగాలివ్వాలి
- ◆ రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**మిర్యాలగూడ నవభూమి సెప్టెంబర్ 11:–**వచ్చే మార్చి 31 నాటికి యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ అన్ని యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభిస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు.బుధవారం ఆయన రాష్ట్ర మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డిలతో కలిసి నల్గొండ జిల్లా దామరచర్ల మండలం లోని యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ ఆయిల్ సింక్రనైజేషన్ ను స్విచ్ ఆన్ చేశారు.ఈ సందర్భంగా మీడియాతో ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఈ సంవత్సరం డిసెంబర్ చివరి నాటికి 3 యూనిట్ల ద్వారా 2400 మెగా యూనిట్ల సామర్థ్యం కలిగిన విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభిస్తామని, వచ్చే సంవత్సరం మార్చి 31 నాటికి అన్ని స్టేజిలలో అన్ని యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. మార్చి 31కి విద్యుత్ అందించేందుకు సివిల్ పనులతో పాటు ,రైల్వే పనులు, బొగ్గు రవాణా వ్యయాన్ని తగ్గించేందుకు పనులను వేగవంతం చేసేలా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఇదే వేగంతో ప్రాజెక్టు పనులు పూర్తిచేసి యూనిట్ విద్యుత్తును 6.35 రూపాయలకు ఇచ్చేందుకు కృషి చేస్తున్నామని ఆయన వెల్లడించారు .యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ పూర్తయితే రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెరుగుతుందని అన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి ప్రజలు వారి ఎంతో విలువైన భూములను ఇచ్చి త్యాగం చేశారని, అలాంటి భూనిర్వాసితులకు భూసేకరణ నిధులతోపాటు, ప్రాజెక్టులో తప్పనిసరిగా ఉద్యోగాలు కల్పిస్తామని, ఇదే విషయాన్ని అధికారులతో నిర్వహించిన సమీక్షలో సైతం తన దృష్టికి తీసుకువచ్చినట్లు డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం వారి కుటుంబాలను గౌరవించడం ప్రభుత్వ బాధ్యతని, వారికి సహేతుకంగా ఆలోచించి వారి కుటుంబాల్లో నిరుద్యోగులైన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.2015, జూన్ 8న శంకుస్థాపన జరిగిన యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ ప్రాజెక్టు పనులు 2017లో ప్రారంభం అయ్యాయని, 2020 అక్టోబర్ నాటికి 2 యూనిట్లు, 2021 నాటికి మూడు యూనిట్లు పూర్తి చేయాలని గత ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించిందని, కానీ అనుకున్న సమయానికి పనులు పూర్తి చేయలేకపోవడం వల్ల రాష్ట్ర ప్రజలపై ఆర్థిక భారం పెద్ద ఎత్తున పడిందని అన్నారు. దీనికి ప్రధాన కారణం గత ప్రభుత్వ చిత్తశుద్ధిలోపమని, అంతేకాక ప్రాజెక్టు నిర్మాణాన్ని వేగవంతం చేయడంలో సమీక్షలు నిర్వహించకపోవడం, త్వరితగత్తిన పూర్తి చేయాలన్న ఆశయం లేకపోవడమని డిప్యూటీ సీఎం తెలిపారు. దీనివల్ల ఉత్పత్తి వ్యయం పెరిగిందని, గత ప్రభుత్వం 50% దేశీయ బొగ్గును, 50 శాతం విదేశీ బొగ్గును వాడాల్సి ఉండగా, దానికి విరుద్ధంగా నూటికి నూరు శాతం దేశీయ బొగ్గును వాడటం వల్ల ఎన్జీటీ క్లియరెన్స్ రాలేదని, తమ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఎన్జీటీ క్లియరెన్నను తీసుకోవడం, ప్రాజెక్టు త్వరితగతిన పూర్తి చేసేందుకు నిరంతరం అధికారులతో సమీక్షించడం, ప్రతిరోజు ప్రాజెక్టు పనులపై పర్యవేక్షణ చేయడం జరుగుతున్నదని వెల్లడించారు. నూతన ప్రభుత్వ చర్యల వల్లనే సెప్టెంబర్ నాటికి ఆయిల్ సింక్రన్నైసేషన్ స్విచ్ ఆన్ వరకు తీసుకు రాగలిగామని, రాబోయే రోజుల్లో నిర్దేశించిన లక్ష్యం మేరకు ప్రాజెక్టును పూర్తి చేసి ప్రజలకు అందిస్తామని తెలిపారు. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్రెడ్డి మాట్లాడుతూ వైటిపిఎస్, పులిచింతల ప్రాజెక్టులో భూములు కోల్పోయిన వారికి తక్షణమే వారి కుటుంబాలలోని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఆదేశించిన ఉప ముఖ్యమంత్రి కి ధన్యవాదాలు తెలిపారు. అంతేకాకుండా వైటిపిఎస్ లో చిన్న చిన్న సబ్ కాంట్రాక్టర్స్ కు పెండింగ్లో ఉన్న బిల్లులను తక్షణమే చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని, అలాగే ట్రాన్స్ఫార్మర్స్, సబ్ స్టేషన్ లు మంజూరు చేయాలని ఉప ముఖ్యమంత్రి కి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర రోడ్లు ,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ నాలుగు సంవత్సరాలు ఆలస్య మైనప్పటికీ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తిచేయాలని తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి పనులను పూర్తి చేస్తున్నదని, ఇందులో భాగంగానే ఈ ఏడాది డిసెంబర్ నాటికి మూడు యూనిట్లు, మార్చి 2025 నాటికి అన్ని యూనిట్లు పూర్తి చేసి 4,000 మెగా వాట్ల విద్యుత్ ను అందించనున్నట్లు వెల్లడించారు. భూములు ఇచ్చిన వారి జాబితా రూపొందించి వారికి న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించారని ఆయన తెలిపారు. అంతకుముందు అధికారులతో డిప్యూటీ సి ఎం వైటిపిఎస్ పనుల పురోగతిపై మంత్రులతో కలిసి సమీక్షించారు. సమావేశం ప్రారంభంలో రాష్ట్ర ఇంధన శాఖ కార్యదర్శి, టీజీ జెన్కో చైర్మన్, ఎండి రోనాల్డ్ రోస్ యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ అన్ని యూనిట్ల పురోగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, ఇంధన శాఖల శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ స్టేజ్ ఒన్, స్టేజి 2 లోని అన్ని యూనిట్లను నిర్దేశించిన సమయం ప్రకారం పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంతేకాక థర్మల్ పవర్ ప్లాంట్ పూర్తయ్యేనాటికి ఆర్ అండ్ బి రోడ్డును సైతం పూర్తిచేయాలని, ఈ విషయమై ఆర్ అండ్ బి మంత్రితో సమన్వయం చేసుకొని తక్షణమే టెండర్లు పిలిచి పనులు పూర్తి చేసేలా చూడాలన్నారు .రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన భూ నిర్వాసితులకు తగిన విధంగా న్యాయం చేయాలని, వైటీపీఎస్, పులిచింతల ప్రాజెక్టులో భూములు కోల్పోయిన వారి కుటుంబాలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. అంతేకాక ప్రాజెక్టులో సబ్ కాంట్రాక్ట్ పనులు చేసిన చిన్న చిన్న కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను చెల్లించాలని కోరారు. రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ కు అవసరమైన ఆర్ అండ్ బి రోడ్ల పూర్తికై వెంటనే చర్యలు తీసుకుంటామని, గురువారమే ఎస్ఈ ని అక్కడికి పంపించి పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రాజెక్టు పూర్తయ్యేనాటికి దామరచర్ల నుండీ ప్లాంట్ వరకుఫోర్ వే నిర్మాణం పూర్తి చేయాలని, అంతేకాక భూములు కోల్పోయిన నిర్వాసితుల కుటుంబంలో శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు.వివిధ శాఖల అధికారులతో సమస్యలు వాటి పరిష్కారంపై డిప్యూటీ సిఎం సమీక్షించారు. వైటీపిఎస్ లో అన్ని విభాగాలను ముగ్గురు మంత్రులు తిరిగి చూశారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి , అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ మాలెంపాటీ,ప్రాజెక్టు డైరెక్టర్లు సచ్చిదానంద ,అజయ్, చీఫ్ ఇంజనీర్ సమ్మయ్య, ఎస్ఇ పీవీ శ్రీనివాస్, జి శ్రీనివాసరావు, ప్రాజెక్టు ఇంజనీర్లు, అధికారులు, డిసిసి అధ్యక్షుడు కె. శంకర్ నాయక్, నాయకులు డీ. స్కై ల్యాబ్ నాయక్ పాల్గొన్నారు.













## స్వామివారిని తనివితీరా చూసేలా!





**నార్కట్‌పల్లి నవభూమి** చెర్వుగట్టులోని శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి గుహాలయానికి వచ్చే భక్తులకు స్వామి వారి దర్శనం ఇబ్బందులు తొలగిపోనున్నాయి.ప్రధాన ఆలయంలోని గుహలోనే కొలువైన మూలవిరాట్టు శివ లింగాన్ని భక్తులు తనివితీరా చూసేందుకు గత ఏడాది నుంచి పనులు జరుగుతున్నాయి. దేవస్థానం నుంచి నిధులు కేటాయించి స్వామివారు ఉన్న ప్రదేశంతో పాటు ఎడమవైపు ఉన్న భారీ బండరాయిని యంత్రాల సహాయంతో రెండు అడుగుల మేర తొలిచారు. భక్తుల మనోభావాలు దెబ్బతినంకుండా ఆలయ పవిత్రతకు భంగం కలగకండా దేవాదాయ, ధర్మాదాయ శాఖ వాస్తు నిపుణుడు వల్లి నాయకగం గతంలో పరిశీలించి సూచనలు చేయడంతో పనులు ప్రారంభించారు.మూలవిరాట్టుగా ఉన్న లింగాకారం కొలువైన చిన్నపాటి గుహలో కేవలం ఒక అర్చకుడు మాత్రమే కూర్చునేంత స్థలం మాత్రమే ఉంటుంది. దీనికి తోడు స్వామివారికి ఎడమవైపు ఉన్న పెద్ద బండరాయి ఇబ్బందిగా ఉండటంతో ఆగమశాస్త్రం మేరకే క్యూలైన్‌లో ప్రవేశద్వారం నుంచి భక్తులు వంగి స్వామి వారి దర్శనం చేసుకునే సమయంలో అసౌకర్యానికి గురవుతున్నారు. దీనికి తోడు స్వామి వారి వద్ద అభిషేకం, వీఐపీలు, ఇతర ముఖ్యులు వచ్చిన సమయంలో స్వామివారిని దర్శనం చేసుకోవడం సామాన్య భక్తులకు ఇబ్బందిగా ఉండేది.ఈ విషయం తెలుసుకున్న సంబంధిత అధికారులు భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా, ఆలయ పవిత్రతకు భంగం కలగకుండా రాతిబండ పొరను తొలగించి పనులు చేశారు. ప్రస్తుతం గుహాలయంలో స్వామివారు భక్తులకు ఇబ్బంది లేకుండా మరింత చేరువగా తనివితీరా చేసేలా దర్శనం ఇస్తున్నారు. త్వరలోనే పనులు పూర్తి చేస్తామని ఈవో నవీన్‌కుమార్ తెలిపారు.

## యాదాద్రికి వైద్యులొస్తున్నారు..!

**భువనగిరి గంజ్, నవభూమి** యాదాద్రి ప్రభుత్వ వైద్యకళాశాల ఏర్పాటుకు జాతీయ వైద్యమండలి అనుమతి లభించింది. ఈ ఏడాది నుంచి కళాశాల ప్రారంభించేందుకు లెటర్ ఆఫ్ పర్మిషన్‌ను జారీ చేస్తూ ఉత్తర్వుల వెలువరించినట్లు కళాశాల ప్రిన్సిపల్ రమేష్‌రెడ్డి తెలిపారు.కళాశాల ఏర్పాటుపై ఎన్ఎంసీ ప్రత్యక్ష, పరోక్ష తనిఖీల సందర్భంగా లేవనెత్తిన అభ్యంతరాలను సరిచేస్తూ కళాశాల ప్రిన్సిపల్, అధికారులు అప్పీలు చేశారు. నివేదికపై ఎన్ఎంసీ సంతృప్తి వ్యక్తం చేసి ఈ ఏడాది నుంచి 50 సీట్లతో కళాశాల ప్రారంభించుకోవాలని సూచించింది. ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం వైద్యవిద్య తరగతులను పగిడిపల్లిలోని పాత కలెక్టరేట్ భవనంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయనున్నారు. ఇప్పటికే ఈ భవనాన్ని ఎంపిక చేశారు.220 పడకల ఆసుపత్రిగా... ప్రస్తుతం ఉన్న జిల్లా కేంద్రాసుపత్రిని ఇప్పటికే వైద్యకళాశాల ఆసుపత్రి డీఎంఈ పరిధిలోకి మార్చారు. 220 పడకల బోధనాసుపత్రిగా మార్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కళాశాలకు అనుబంధంగా మారనుండటంతో వైద్యసేవలు మెరుగుకానున్నాయి. కావాల్సిన విభాగాల ఏర్పాటు కోసం ఆసుపత్రిలో మరో అంతస్తు నిర్మాణానికి పనులు ప్రారంభించారు. అత్యవసర విభాగం, జనరల్ మెడిసిన్, శస్త్రచికిత్స, సుమారు 17 విభాగాలు అందుబాటులోకి రానున్నాయి. వైద్యకళాశాల ఏర్పాటుతో బోధనాసుపత్రిలో నిత్యం వైద్యులు అందుబాటులో ఉండటంతో మెరుగైన వైద్యసేవలు జిల్లా ప్రజలకు అందుబాటులోకి వస్తాయి.

# కాసులిస్తేనే.. కదలిక

**నల్గొండ - నవభూమి** అధికలోడు, వివిధ కారణాలతో కాలిపోయిన నియంత్రికలను మరమ్మతులు చేసేందుకు నియంత్రికల మరమ్మతు కేంద్రాల్లో (ఎస్పీఎం) రైతుల నుంచి విద్యుత్తు సిబ్బంది డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.విద్యుత్తు నియంత్రణ మండలి (ఈఆర్సీ) ఆదేశాల ప్రకారం కాలిపోయిన నియంత్రికలను పొలాల వద్ద నుంచి ఎస్పీఎంలకు సదరు విద్యుత్తు పంపిణీ సంస్థే తరలించి రైతులకు భారం కాకుండా మరమ్మతుల అనంతరం సంస్థే నియంత్రికను అమర్చాలి.అయితే ఒక్కో ఎస్పీఎం పరిధిలో నిత్యం నాలుగైదు నియంత్రికలు చెడిపోవడం, కాలిపోవడం లాంటివి చోటు చేసుకుంటుండటంతో రైతులే సొంతంగా రవాణా ఖర్చులు భరించి మరమ్మతుల కోసం ఎస్పీఎంలకు తీసుకువస్తున్నారు. ఒకవేళ రైతులే రవాణా ఖర్చులు భరించి తీసుకువస్తే సదరు వాహన డ్రైవర్ బ్యాంకు ఖాతాకు నిధులు జమచేయాల్సి ఉంటుంది. క్షేత్రస్థాయిలో అది అమలు కావడం లేదు.ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 22 ఎస్పీఎం కేంద్రాలుండగా.. ప్రతి కేంద్రంలో మరమ్మతులు ఉన్న నియంత్రికలను రవాణా చేసేందుకు ప్రతి కేంద్రానికి ఒక వాహనాన్ని విద్యుత్తు పంపిణీ సంస్థ ఏర్పాటు చేసింది. అవి సకాలంలో రాకపోవడంతో రైతులు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మరోవైపు ఈ ఏడాది వానాకాలం సీజన్ ప్రారంభమయ్యాక మూడు జిల్లాల పరిధిలో సుమారు వేయి వరకు నియంత్రికలు మరమ్మతుల కోసం వచ్చినట్లు



సంబంధిత వర్గాలు వెల్లడించాయి. వీటిలో 80 శాతం వరకు రైతులే నేరుగా రవాణా ఖర్చులు భరించి కేంద్రాలకు తీసుకువచ్చినవే ఉన్నాయి.బోరు బావులు ఇక్కడే ఎక్కువ బోరు, బావుల కింద వ్యవసాయంలో రాష్ట్రంలోనే నల్గొండ జిల్లా మొదటి స్థానంలో ఉంది. ఒక్క విభాజ్య నల్గొండ జిల్లాలోనే సుమారు 6 లక్షలకు పైగా వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. అనధికారికంగా మరో లక్ష వరకు ఉన్నాయి. ఒక నియంత్రికపై ఎక్కువ మోటార్లు ఉండటంతో అందులోని ఆయిల్ వేడెక్కి కాలిపోతున్నాయి.ఉదాహరణకు 25కేవీ నియంత్రికకు కేవలం నాలుగు మోటార్లే అనుసంధానం చేయాల్సి ఉండగా.. కొన్ని చోట్ల 8 వరకు మోటార్లను నడిపిస్తున్నారు. దీంతో తరచూ మరమ్మతులు వస్తున్నాయి. ఈ నిర్వహణ ఖర్చులు రైతులకు భారంగా మారుతున్నాయి.మండల పరిధిలో ఎస్పీఎంలు ఉంటే రైతులు అక్కడికే తీసుకెళ్లాల్సి ఉంటుంది. అక్కడ కొత్తది ఇవ్వడానికి కాస్త సమయం పడుతుండటంతో రైతులంతా జిల్లా కేంద్రాలైన నల్గొండ, సూర్యాపేట, భువనగిరి ఎస్పీఎంలను ఆశ్రయిస్తున్నారు. దీంతో ఒక నియంత్రిక మరమ్మతుకు రానుపోనూ రవాణా ఛార్జీలు సగటున రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు రైతులకు ఖర్చువుతున్నాయి.నల్గొండ ఎస్పీఎం కేంద్రానికి ట్రాక్టర్‌లో రైతులు తీసుకువచ్చిన కాలిపోయిన నియంత్రిక ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం రైతులు తీసుకువచ్చే నియంత్రికల మరమ్మతులకు సిబ్బంది డబ్బులు వసూలు చేస్తున్నారని మా దృష్టికి రాలేదు. రైతులెవరైనా ఫిర్యాదు చేస్తే వాస్తవాలు పరిశీలించి చర్యలు తీసుకుంటాం. రైతులే నియంత్రికలను తీసుకువస్తే వారికి డబ్బులు చెల్లించే ప్రక్రియ నిరంతరం జరిగేదే.

# దారులు 'మూసీ'ంది

**వలిగొండ, నవభూమి** యాదాద్రి భువనగిరి జిల్లాలో మూసీ పరీవాహక ప్రాంతాలైన వలిగొండ, బీబీనగర్, భువనగిరి, భూదాన్‌పోచంపల్లి, రామన్నపేట మండలాల్లోని గ్రామాలకు వెళ్లే రహదారుల్లో నదిపై నిర్మించిన లోలెవల్ వంతెనలు శిథిలావస్థలకు చేరుకున్నాయి.నిర్వహణ సరిగా లేక గుంతలు ఏర్పడ్డాయి. కనీసం రక్షణ గోడలు లేకపోవడంతో ప్రమాదాలకు నిలయంగా మారాయి.ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వంతెన మీదుగా వరద పారడంతో కొద్ది రోజుల పాటు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వరద తగ్గాక జారే కల్వర్టుల పై నుంచి వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టు కోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఏటా ఇదే సమస్య తలెత్తుతోందని, పాలకుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం చూపడం లేదని పరిసర గ్రామాల ప్రజలు వాపోతున్నారు.వలిగొండ మండలం సంగెం గ్రామ పరిధిలో భీమలింగం వద్ద ఉన్న మూసీ వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు లేవు. వంతెన శిథిలావస్థకు చేరుకొని గుంతలు ఏర్పడ్డాయి. భువనగిరి నుంచి చౌటుప్పల్, సంస్థాన్‌నారాయణపురం, మునుగోడు, చండూరు, గట్టుప్పల్ మండలాలకు వెళ్లడానికి ప్రధాన రహదారి కావడంతో వందల సంఖ్యలో నిత్యం వాహనాలు నడుస్తున్నాయి. వలిగొండ మీదుగా సుమారు 20 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి వస్తోంది. భువనగిరిలో చదువుకునే సంగెం, వర్కట్‌పల్లి, గోకారం గ్రామాల పాఠశాల, కళాశాల విద్యార్థులు మూసీ నది ప్రవహించేప్పుడు ఇంటి వద్దనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.వలిగొండ మండల కేంద్రం నుంచి భువనగిరి వెళ్లే రహదారిపై సాయిగణేశ్ ఫంక్షన్ హాల్ పక్క నుంచి వెళ్తున్న భీమలింగం కాల్వపై ఉన్న లోలెవల్ వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు లేవు.రామన్నపేటకు వెళ్లే రహదారి వలిగొండ మండలం వేములకొండ పరిధిలో వంతెనపై కూడ సరిగా రక్షణ గోడలతో పాటు నిర్వహణ సరిగా లేదు.బీబీనగర్ మండలం రుద్రవెల్లి- జూలురు వద్ద మూసీ వంతెనపై వర్షం కురిసినప్పుడు రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. భువనగిరి మండలం బొల్లేపల్లి సమీపంలోని మూసీ వంతెనకు గుంతలు ఏర్పడి ఇరువైపులా రక్షణ గోడలు లేవు.రక్షణ గోడలు ఏర్పాటు చేయిస్తాం:సుగేందర్, డీఈ, భువనగిరి కల్వర్టులపై ఇరువైపులా రక్షణ గోడలు ఏర్పాటు చేస్తాం. బొల్లేపల్లి -చౌటుప్పల్ రహదారి ఆర్అండ్‌బీ శాఖ నుంచి నేషనల్ హైవే అథారిటీకి మార్చారు. త్వరలో ప్రభుత్వం టెండర్లకు పిలుస్తోంది. టెండర్ల ప్రక్రియ పూర్తయిన తర్వాత రహదారి నిర్మాణ పనులతో పాటు సంగెం మూసీ హైలెవల్ వంతెన నిర్మాణ పనులు చేపడతారు.

